సాక్షి
అనకాపల్లి

ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



సిరులతల్లికి తులసీదళార్చన

విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.



పలు రైళ్ల రద్దు.. మరికొన్ని దారి మళ్లింపు

8లో

దివ్యాంగుల క్రికెట్ జట్ల ఎంపికలు



విశాఖ స్పోర్ట్స్: జిల్లా డిజేబుల్డ్ క్రికెట్ జట్ల ఎంపిక శనివారం వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్‌లో జరిగింది. ఫిజికల్లీ డిజేబుల్డ్, మూగ కేటగిరీల్లో క్రీడాకారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మాఘ పౌర్ణమి జాతరకు ఏర్పాట్లు



తీరంలో జాతర జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో ఈ నెల 12 జరగబోయే మాఘపౌర్ణమి జాతరకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆదేశించారు. తీరంలో జాతర జరిగే ప్రదేశాన్ని శనివారం డీఎస్పీ సందర్శించారు. లక్షకు పైగా భక్తులు వచ్చే అంచనా ఉన్నందున్న ట్రాఫిక్ క్లియరెన్స్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.వచ్చిన ప్రతి ఒక్కరూ తీరంలో స్నానాలు ఆచరిస్తారు కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోపలకి వెళ్లకుండా అప్రమత్తం చేస్తూ గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే జేబుదొంగలపై నిఘా పెట్టాలన్నారు. ప్రయివేటు వాహనాలను అడ్డురోడ్డు పరిధిలో నుంచి అనుమతించరాదని తెలిపారు. అన్ని ప్రాంతాలవారికీ ఆర్టీసీ బస్సు సర్వీసులు అందేలా సమన్వయం చేయాలన్నారు. ఈ పర్యటనలో అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ, ఎస్.రాయవరం ఎస్‌ఐ విభీషణరావు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ వ్యర్థాల కాలుష్యంపై ఆర్డీవో విచారణ



ఫ్యాక్టరీ వద్ద ఫ్యాక్టరీ ఎండీ తదితరులతో మాట్లాడుతున్న ఆర్డీవో ఆయిషా

చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వ్యర్థాలు శారదానది నీటి ప్రవాహంలో చేరి కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఉందని అనకాపల్లి ఆర్డీవో ఆయిషా పేర్కొన్నారు. శనివారం ఆమె ఫ్యాక్టరీని సందర్శించారు. సుగర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి. సన్యాసినాయుడు, చీఫ్ కెమిస్ట్ ప్రసాద్‌లతో ఆమె మాట్లాడారు. శారదానది నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. నీరు కలుషితం కావడం వల్ల చేపలు మృతి చెందుతున్నాయని రైతులు ఫిర్యాదు చేశారన్నారు. కాగా ఇక నుంచి అటువంటి ఇబ్బందులు ఉండవని ఆమె పేర్కొన్నారు. అనంతరం డ్రైనేజీలను పరిశీలించారు. జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఏఈ సంబంధిత విషయాలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఆర్డీవో వెంట స్థానిక తహసీల్దారు రామారావు, డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

• శత సహస్ర దీపార్చన వైభవం



నర్సీపట్నంలోని సాయిబాబా ఆలయంలో లక్ష ప్రమిదల వెలుగులు

ఆధ్యాత్మిక పరిమళం..

భీష్మ ఏకాదశి సందర్భంగా జిల్లాలో ఆధ్యాత్మిక కాంతులు ప్రసరించాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నర్సీపట్నం లోని సాయిబాబా ఆలయంలో లక్ష దీపార్చన వైభవంగా జరిగింది. కశింకోటలోని త్రిపురాంతక స్వామికి లక్ష బిల్వార్చన జరిపారు.



లక్ష బిల్వార్చన పూజలందుకున్న కశింకోటలోని త్రిపురాంతక స్వామి

అజ్మీర్‌లో ఎన్‌వోఐడబ్ల్యూ త్రైవార్షిక సదస్సు

అనకాపల్లిటౌన్ : నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ (ఎన్‌వోఐడబ్ల్యూ) అఖిల భారత 19వ త్రైవార్షిక సదస్సు ఈ నెల 9,10 తేదీలలో రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్‌లో జరుగుతుందని కేంద్ర కమిటీ సభ్యుడు బొడ్డేడ అప్పల నర్సయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భారతీయ బీమా సంస్థలో 1969వ సంవత్సరంలో నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ ఆర్గనైజేషన్‌ను ప్రారంభించామని, కార్మికుల సమస్యలు, బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడాన్ని వ్యతిరేకించడం, తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తదితర డిమాండ్‌లను చర్చిస్తామని తెలిపారు. అన్ని రాష్ట్రాల నుంచి 2500 మంది సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

జాతీయ రహదారులకు 220 మీటర్లలోపు మద్యం షాపు ఏర్పాటు చేయకూడదు!
ఇవి స్పష్టంగా దేశ అత్యున్నత న్యాయస్థానం జారీచేసిన ఆదేశాలు!!
హోం మంత్రి నియోజకవర్గంలో మాత్రం సుప్రీంకోర్టు ఆదేశాలనూ తూచ్ అంటున్నారు. జాతీయ రహదారి 16కు కేవలం 120 మీటర్ల దూరంలోనే అనకాపల్లి జిల్లా ఎస్. రాయవరం మండల పరిధిలోని పెదగుమ్ములూరు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఏఆర్‌కే వైన్స్‌కు మాత్రం ఈ నిబంధనలు ఏవీ వర్తించడం లేదు. ఎందుకంటే ఇది హోం మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం. అధికార పార్టీ నేతలకు కొమ్ముకాస్తూ ఎక్సైజ్ అధికారులు కాస్తా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించి ఏకంగా టెంపరరీ లైసెన్స్‌తో పాటు పర్మనెంటు లైసెన్స్ కూడా జారీచేశారు.



నిబంధనలకు విరుద్ధంగా హైవేకు దగ్గరగా ఏర్పాటు చేసిన ఏఆర్‌కే వైన్స్

• అక్రమాలకు ‘లైసెన్స్’

ఎక్సైజ్.. జీ హుజూర్

- ఏఆర్‌కే వైన్స్‌కు అధికారులు దాసోహం
- ఎన్‌హెచ్‌కు 120 మీటర్ల దూరంలోనే మద్యం షాపు
- అయినా పర్మనెంట్ లైసెన్స్ మంజూరు
- సుప్రీంకోర్టు ఆదేశాలూ బేఖాతరు
- హోంమంత్రి ఇలాకాలోనే ఇష్టారాజ్యం
- ఫిర్యాదుతో తీరిగ్గా నోటీసు జారీ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం : వైన్స్ షాపులోని మొదటి అక్షరం ఏ అంటే హోం మంత్రి అనిత అనుకున్నారో ఏమో కానీ ఏకంగా సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ఎక్సైజ్ అధికారులు పక్కన పెట్టి ఏఆర్‌కే వైన్స్‌కు దాసోహం అన్నారు. మరోవైపు పక్కనే మరో వైన్‌షాపు ఎస్‌వీడీ వైన్స్ 160 మీటర్లలోపు ఉంది..దానిని వెంటనే మార్చేయాలంటూ స్వయంగా ఎక్సైజ్ ఉన్నతాధికారులు టేపు పెట్టి మరీ కొలిచి దూరంగా తరలించడం గమనార్హం. దీనిపై నేరుగా ఎక్సైజ్ ఉన్నతాధికారులతో పాటు లోకాయుక్తకు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో తాజాగా 5 రోజుల క్రితం సదరు వైన్ షాపునకు ఎక్సైజ్ అధికారులు నోటీసులు జారీచేయడం గమనార్హం.



హోంమంత్రి ఇలాకాలో బెల్ట్ షాప్‌లకు మద్యం తరలిస్తూ పట్టుబడిన ఆటో (ఫైల్)

వీరికి ఓకే...వారికి ‘నో’...!

ఈ ఏఆర్‌కే వైన్ షాపు నుంచి చూస్తే జాతీయ రహదారి కనిపిస్తుంది. జాతీయ రహదారి వెంట వెళ్లే వాహనాలు కూడా కనిపిస్తుంటాయి. ఈ వైన్ షాపును జాతీయ రహదారికి కేవలం 120 మీటర్ల దూరంలోనే ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పర్మనెంటు లైసెన్సును కూడా జారీచేశారు. మరోవైపు అక్కడికి దగ్గరిలోని మరో వైన్ షాపును మాత్రం **220 మీటర్లకు అవతల ఏర్పాటు చేయాల్సిందేనంటూ ఎక్సైజ్ ఈఎస్ సుధీర్ స్వయంగా టేపు పట్టి కొలిచి మరీ మార్పిన తర్వాతే పర్మనెంట్ లైసెన్స్‌ను మంజూరు చేశారు. తమ షాపును మార్పినట్టుగానే**...తమకంటే జాతీయ రహదారికి ఇంకా దగ్గరగా ఉన్న ఏఆర్‌కే వైన్స్‌ను కూడా మార్చాలంటూ ఎస్‌వీడీ షాపు యాజమాన్యం అధికారులను కోరినా వారు మా త్రం పట్టించుకోలేదు. మరోవైపు ఏఆర్‌కే వైన్స్‌కు పర్మనెంటు లైసెన్స్‌ను కూడా జారీచేశారు. ఈ వైన్‌షాపు స్థానికంగా టీడీపీ నేతలకు చెందినది కావడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ వైన్ షాపు లైసెన్స్‌దారుడు కోయిలాడ కమల్ చంద్రతో పాటు ఇందులో స్థానిక రాయవరం మండల నేత అబద్ధంతో పాటు తన పీఏగా తొలగించానని హోం మంత్రి అనిత చెబుతున్న జగదీశ్‌కు కూడా వాటా లున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు కూడా చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

బెల్టు దుకాణాలకు భారీగా..!

మరోవైపు భారీగా బెల్టు దుకాణాలకు కూడా మద్యాన్ని గుడివాడలో ఉన్న మరో ప్రైవేటు మద్యం దుకాణం కేకే వైన్స్ యాజమాన్యం తరలిస్తోంది. ఏకంగా 47 కేసుల బ్రాందీతో పాటు 1380 బీరు సీసాలను ఆటోల్లో తరలిస్తుండగా 27 జనవరి 2025న గ్రామస్తులు పట్టుకుని పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చివరకు ఆధారాలతో సహా నేరుగా ఎస్పీకి ఫిర్యాదు వెళ్లడంతో స్థానిక ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. 30 కేసులు దాటి బెల్టు షాపులకు మద్యాన్ని తరలిస్తున్నట్టు తేలితే సదరు మద్యం దుకాణ లైసెన్స్‌ను రద్దు చేసే అధికారం ఉంది. అయినప్పటికీ ఇప్పటి వరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వైన్ షాపు కూడా టీడీపీ నేతలకు చెందినది కావడమే ఇందుకు కారణమన్న విమర్శలున్నాయి. ఈ వైన్ షాపు కూడా హోం మంత్రి నియోజకవర్గంలోనే ఉండడం గమనార్హం.

నోటీసులు జారీచేశాం



జాతీయ రహదారికి 220 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన ఏఆర్‌కే వైన్స్‌కు ఈ నెల 3వ తేదీన నోటీసులు జారీచేశాం. సమాధానమిచ్చేందుకు 10 రోజుల సమయం ఇచ్చాం. ఆ తర్వాత నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా పర్మనెంట్ లైసెన్స్ మంజూరు చేసిన అధికారులకు కూడా నోటీసులు జారీచేశాం.

– సుధీర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అనకాపల్లి

మట్టి బుక్కేస్తున్నారు...

- ఎర్రవరం కేసవరయ కొండ, అచ్చన్న చెరువుల్లో అక్రమ తవ్వకాలు
- రాత్రి వేళల్లో యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ రవాణా
- లేఅవుట్‌లు, నిర్మాణాలకు తరలింపు
- సహజ సంపదకు పొంచి ఉన్న ముప్పు





ఎర్రవరం పరిధిలోని కొండలు, చెరువుల్లో అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వుతున్న ప్రాంతాలు

అచ్యుతాపురం: అచ్యుతాపురం మండలంలో గ్రావెల్ భూతం బుసలు కొడుతోంది. లే అవుట్‌లు, ఇతరత్రా నిర్మాణాల కోసం గ్రావెల్‌కు మంచి డిమాండ్ పెరిగింది. అధికారికంగా గ్రావెల్ లీజు తీసుకోవాలంటే అనేక చిక్కులు, నిబంధనలు చూసి అక్రమార్కులు రాత్రి వేళ రెచ్చిపోతున్నారు. అడ్డదారిలో సొమ్ము సంపాదించుకునేందుకు ఉన్న మార్గాల్లో గ్రావెల్ తవ్వకం, తరలింపు ప్రస్తుతం అచ్యుతాపురంలో ప్రధాన ఆదాయ వనరుగా మారింది. సెజ్, బార్క్, నేవల్ బేస్ వంటి ప్రాంతాల్లో భారీ గోతుల్ని పూడ్చేందుకు కొన్ని వేల టన్నుల గ్రావెల్ అనివార్యమయ్యింది. మరోవైపు లే-అవుట్‌లకు, భారీ భవనాల నిర్మాణాలకు గోతుల్ని పూడ్చాల్సి వచ్చింది. ఈ క్రమంలో గ్రావెల్ మాఫియా పంజా విసురుతోంది.

ఎర్రవరం కొండలు గుల్ల... : అచ్యుతాపురం మండలంలోని ఎర్రవరం, మల్లవరం, జగన్నాథపురం, నరేంద్రపురం తదితర కొండల్లో గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కొండలతో పాటు, చెరువుల్ని కూడా వదలడం లేదు. ఎర్రవరం పరిధిలోని సర్వే నంబర్148/బి, 149/1 సి, 147/1 సర్వే నంబర్లలో సుమారు 13 ఎకరాల విస్తీర్ణంలో అచ్చన్న చెరువులో మట్టి తవ్వకాలు రాత్రి వేళ భారీగా సాగుతున్నాయి. ఎర్రవరం, కేసవరయ కొండ పరిధిలో గతంలో బడుగు, బలహీన వర్గాలకు పట్టాలిచ్చిన భూముల్లో సైతం గ్రావెల్ తరలింపు జోరుగా సాగుతోంది. ఈ గ్రావెల్ లోడుతో కూడిన వాహనాలన్నీ ఇటు కొండకర్ల జంక్షన్ వైపు, అటు నర్సింగబిల్లి వైపు వెళ్తున్నా అధికారులు దాడులు చేయలేకపోతున్నారు. రవాణా శాఖ, భూగర్భ గనుల శాఖ, రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించి అక్రమ మట్టి తవ్వకాలు, గ్రావెల్ తరలింపుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో కీలక నిందితుడు అరెస్ట్

- ఇప్పటివరకు 11 మంది ఆటకట్టించిన పోలీసులు

విశాఖ సిటీ: క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో కీలక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే వరకు 11 మంది నిందితులను కటకటాల్లోకి పంపించిన పోలీసులు.. తాజాగా గోవాలో దాక్కున్న ఏ2 ఎస్కే జిలానీని సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆన్‌లైన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పెదవాల్తేరులోని డాక్టర్ కాలనీలో ఒక అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని విచారించగా దీని వెనుక పెద్ద ముఠా ఉన్నట్లు గుర్తించారు. ఒకరి ద్వారా మరొకరి సమాచారం తెలుసుకుంటూ ఇప్పటి వరకు 11 మందిని అరెస్టు చేశారు. ఇప్పటికే కీలక సూత్రదారి ఏ1 అడ్డూరి సుఖవర్మను పోలీసులు రిమాండ్‌కు పంపించగా.. తాజాగా మరో కీలక నిందితుడు ఏ2 ఎస్.కె.జిలానీని సైబర్ క్రైమ్ పోలీసులు గోవాలో అరెస్టు చేశారు. వారు ఉపయోగించిన బ్యాంక్ ఖాతాలను పరిశీలించగా 137 అకౌంట్ల ద్వారా రూ.400 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. మరిన్ని అకౌంట్లను పరిశీలించాల్సి ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో ఏ3గా లగుడు రవికుమార్, ఏ6గా గుడ్డాల రమణ, ఏ7గా కోరాడ శ్రీనివాసరావు, ఏ8గా గెడ్డం మహేష్, ఏ9గా మడకా రామకృష్ణ, ఏ10గా ఆరిపాక శ్రీనాథ్, ఏ11గా కాట్ర సిమ్రాన్ జోత్సింగ్, ఏ12గా కండికట్టు కమల్నాద్, ఏ15గా దూడరాజు, ఏ16గా సోమరాజు సతీష్‌లను పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

పూలతలే...వంచిన విల్లులై..



- యోగాలో ప్రతిభా కుసుమాలు
- కఠోర శిక్షణతో సునాయాసంగా యోగాసనాలు
- పోటీలలో పతకాలు
- ఇటీవల గణతంత్ర వేడుకల్లో యోగా నృత్య ప్రదర్శనలు
- కలెక్టర్, ఇతర ప్రముఖుల ప్రశంసలు
- అబ్బురపరుస్తున్న బేతపూడి కేజీబీవీ బాలికలు

దేవరాపల్లి: తీగ మల్లెలే ఎక్కుపెట్టిన విల్లులై...సుమబాలలే సంధించిన శరాలై...బాలురకు ఎందులోనూ తీసిపోమంటూ... కఠోర సాధనతో మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకుంటున్నారు. యోగాను విజయసోపానంగా మలుచుకున్నారు. ప్రత్యేక శిక్షణతో యోగాలో అద్భుత ప్రదర్శనలు ఇస్తున్నారు. పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నారు బేతపూడి కస్తూర్బాగాంధీ విద్యాలయ బాలికలు.

దేవరాపల్లి మండలం బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థినులు యోగాలో రాణిస్తున్నారు. యోగాసనాల ప్రదర్శనలో బాలురకు తాము ఎక్కడా తీసిపోమంటూ పోటీల్లో ప్రతిభ చూపి అందరి మన్ననలు పొందుతున్నారు. విద్యార్థినులు చదువులకే పరిమితం కాకుండా వారిలో ఉండే ఆసక్తికు అనుగుణంగా స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ సిహెచ్.భువన మాధురి పర్యవేక్షణలో వ్యాయమ ఉపాధ్యాయురాలు జి.కుమారి యోగాపై తర్ఫీదునిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, యోగ సాధనకు ప్రాధాన్యం కల్పించడంతో ప్రస్తుతం సత్ఫలితాలిస్తున్నాయి. కఠోర శిక్షణలో కష్టతరమైన యోగాసనాలను సైతం అవలీలగా వేస్తూ అబ్బురపరుస్తున్నారు. కేజీబీవీకి చెందిన పదో తరగతి విద్యార్థినులు కె.ఉమాదేవి, కె.రేవతి, జి.అనురాధ, వి.ఎమ్లిరోజ్, డి.రమ్య, కె.కీర్తన తదితరులు యోగాలో సత్తా చాటుతున్నారు.



యోగా సాధన చేస్తున్న కేజీబీవీ విద్యార్థినులు

కష్టతరమైన కోకిలాసనం, గోపాలకృష్ణాసనం, గర్భాసనం, రాజకపోతాసనం, ద్విపాదాసనం, ద్వీపాసనం, ఓంకారాసనం, పూర్ణ నటరాజాసనం, వ్యాఘ్రాసనం, వృశ్చికాసనం, పూర్ణ మత్స్యేంద్ర ఆసనం, డింపాసనం తదితర ఆసనాలను సునాయాసంగా వేస్తు ఔరా అనిపిస్తున్నారు.

ప్రతిభకు గీటురాయి..

గత ఏడాది దేవరాపల్లిలో మండల స్థాయిలో జరిగిన యోగా పోటీల్లోను, చీడికాడలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన యోగా పోటీల్లో కేజీబీవీకి చెందిన ఆరుగురు విద్యార్థులు సత్తా చాటారు. గత ఏడాది పరవాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా నిర్వాహకుల చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, మెడల్స్, మెమెంటోలను అందుకున్నారు.

కలెక్టర్ ప్రశంస...

రెండు నెలలు క్రితం స్థానిక కేజీబీవీని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలోనే విద్యార్థినులు యోగాలో రాణిస్తున్నట్టు తెలుసుకున్నారు. అనకాపల్లి జిల్లాలో జరిగే గణతంత్ర వేడుకల్లో యోగసనాల ప్రదర్శన చేయాలని స్థానిక విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన యోగాసనాలతో కూడిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయా విద్యార్థినులను జిల్లా కలెక్టర్ ప్రశంసించి, మెమెంటోను అందజేశారు.



అనకాపల్లిలో ఇటీవల జరిగిన గణతంత్ర వేడుకల్లో విద్యార్థినుల యోగా నృత్య ప్రదర్శన (ఫైల్)



యోగా పోటీల్లో సాధించిన పతకాలు, మెమెంటోలు, ప్రశంసా పత్రాలతో విద్యార్థినులు

ఏకాగ్రత రెట్టింపు



చదువుతో పాటు యోగాలో శిక్షణ పొందుతున్నాం. యోగా సాధన చేయడం ద్వారా మనసిక ప్రశాంత, ఏకాగ్రత రెట్టింపు అవుతుంది. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి యోగా పోటీలలో పాల్గొని ప్రతిభ చూపాం. పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందుకోవడం ఆనందంగా ఉంది. మరింత ఉన్నత స్థానంలో రాణించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాం.

– కె.ఉమాదేవి, పదో తరగతి విద్యార్థిని

యోగా నృత్యప్రదర్శనతో ప్రశంసలు



యోగాలో జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం. ప్రిన్సిపాల్ భువన మాధురి, వ్యాయామ ఉపాధ్యాయురాలు కుమారి సూచనలు పాటిస్తూ యోగా సాధన చేస్తున్నాం. అనకాపల్లిలో జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో యోగాసానలతో కూడిన నృత్య ప్రదర్శన చేయడం గర్వంగా ఉంది.

– కె.రేవతి, పదో తరగతి విద్యార్థిని

అవలీలగా యోగాసనాలు



ప్రతి రోజు ఉదయం, సాయంత్రం యోగా సాధన చేస్తున్నాం. కఠోర సాధనతో కష్టమైన సాధనాలను అవలీలగా వేయగలుగుతున్నాం. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటడమే ధ్యేయం. ప్రోత్సహిస్తే పతకాలను సాధిస్తాం. జిల్లా కలెక్టర్ ప్రశంసలతో మాలో ఉత్సాహం రెట్టింపు అయింది.

– జి.అనురాధ, విద్యార్థిని

జాతీయ పోటీలకు సాధన



విద్యార్థినులకు క్రీడలతో పాటు యోగా, సూర్య నమస్కారాలు, ధ్యానంపై ప్రతి రోజు ఉదయం, సాయంత్రం శిక్షణిస్తున్నాం. యోగాలో విద్యార్థినులు ప్రతిభను గుర్తించి ప్రత్యేకంగా తర్ఫీదునిస్తున్నాం. యోగాలో రాష్ట్ర, జాతీయ పోటీల్లో ప్రతిభ చాటేలా తీర్చిదిద్దుతున్నాం.

– జి.కుమారి, వ్యాయామ ఉపాధ్యాయిని

అన్ని రంగాల్లో రాణించేలా తర్ఫీదు



విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించేలా తర్ఫీదునిస్తున్నాం. సెపక్‌తక్రా, కబడ్డీ తదితర క్రీడలతో పాటు యోగాలో రాణిస్తున్నారు. యోగాసనాలలో రాణించడంపై జిల్లా కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. ఇక్కడి విద్యార్థినులు భరతనాట్యం అద్భుతంగా ప్రదర్శిస్తారు. ఆర్ట్స్, క్రాఫ్ట్, అల్లికలు బాగా చేస్తారు.

– సిహెచ్.భువన మాధురి, ప్రిన్సిపాల్, కేజీబీవీ, బేతపూడి

క్లుప్తంగా

కాలుష్యం బారిన శారదానది



కాలుష్యంతో రంగు మారిన శారదా నది నీరు

కశింకోట : శారదా నది నీరు కలుషితం కావడం పట్ల కశింకోట ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నది ఎగువ ప్రాంతం నుంచి కొద్ది రోజుల క్రితం కలుషిత వ్యర్థ జలాలు కలవడంతో నీటి రంగు నల్లగా మారింది. ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండే జలం ఒక్కసారిగా కలుషితమైంది. నది అవతల కశింకోట రైతుల పశువుల శాలలు ఎక్కువగా ఉండడం వల్ల నిత్యం పశువులు నదిని దాటుతుండటంతో పాటు ఆ నీటిని తాగుతుంటాయి. తాజాగా కలుషితమైన నీటిని తాగుతుండడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నదిలో చేపలు వంటి జల చరాలు కలుషిత నీరు వల్ల మృతి చెందుతున్నట్టు వాపోతున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు సూరిశెట్టి ఆదిబాబు కోరారు.

వైభవంగా మహా కుంభాభిషేక మహోత్సవం



కుంభాభిషేకం నిర్వహిస్తున్న దత్తీశ్వరానంద భారతీస్వామి

అనకాపల్లి : పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిష్ఠ శత జయంతి సహిత మహా కుంభాభిషేక మహోత్సవం భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం ఘనంగా జరిగింది. ఆలయ మండపంలో (1001) ఏకోత్తర సహస్ర కలశ మండపారాధన నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, పూర్ణాహుతి, పరమహంస తమిళనాడు కుర్తాళం, సిద్దేశ్వరపేట ఉత్తరాధికారి శ్రీ దత్తీశ్వరానంద భారతీస్వామి వారు శ్రీ వాసవీమాత మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించి, ఆలయంలో వంద సంవత్సరాల క్రితం స్థాపించిన ఆలయ శిఖరానికి స్వామివారు మహా కుంభాభిషేకం నిర్వహించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు వాసవీమాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు కృష్ణ కుమార్, కార్యదర్శి జగదీశ్వరరావు, కోశాధికారి సోమరాజు, ఉపాధ్యక్షుడు వుప్పల రవి రామ్మవహర్, సహాయ కార్యదర్శి గ్రంధి మాణిక్యం, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘షడ్భుజ వేంకటేశ్వరా’ పద్య కావ్యం ఆవిష్కరణ



పద్య కావ్యాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తమై కల్కి అవతారంలో షడ్భుజాలతో వెలసిన వేంకటేశ్వర స్వామిపై ప్రముఖ వేద పండితులు రచించిన ‘షడ్భుజ వేంకటేశ్వర’ ద్విశతి పద్య కావ్యాన్ని శనివారం ఆవిష్కరించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి సుమారు 34 మంది వేద పండితులు, ప్రముఖ కవులు ప్రాచీనమైన ఛందస్సును ఉపయోగించి ఈ షడ్భుజ వేంకటేశ్వర ద్విశతి పద్య కావ్యాన్ని రచించినట్లు ఉపమాకకు చెందిన అభినవ మొల్ల, ప్రముఖ వేద పండితురాలు, విశ్రాంత తెలుగు పండిట్, డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవి తెలిపారు. ఈ పద్య కావ్యాన్ని ఛందోబ్రహ్మ, పద్య గురు సార్వభౌమ వేద పండితులు బ్రహ్మశ్రీ తోపెల్ల బాలసుబ్రహ్మణ్య శర్మ తదితరులతో ఉపమాక వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ తోపెల్ల బాలసుబ్రహ్మణ్యశర్మ తదితర ప్రముఖులు మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామిపై ద్విశతి పద్య కావ్యాన్ని రచించాలనే ఆలోచన వచ్చినపుడు పలువురు కవులు, వేదపండితుల వద్ద ప్రస్తావించినట్లు తెలిపారు. ఈ మకుటానికి వృత్తాలను పరిశోధించగా 32 ఛందాలు లభించాయన్నారు. వీటిని రచయితలకు పంపిణీ చేసి ఒక్కొక్కరు 5 లేదా 10 పద్యాలు రాయాలని కోరామన్నారు. ఎక్కువ మంది పది పద్యాలు రాయగా తక్కువ మంది ఐదు పద్యాల చొప్పున రాశారన్నారు. ఛందములు 32 అయినప్పటికీ రాసిన వారు మాత్రం 34 మంది అన్నారు. వీరి ఆసక్తితో శతకం కాస్తా ద్విశతి అయిందన్నారు. షడ్భుజ వేంకటేశ్వర అనే మకుటంతో వాడిన ఛందం వాడకుండా ఈ ద్విశతి పద్యకావ్యాన్ని రచించడం చాలా గొప్ప విషయమన్నారు. ఛందస్సులో నూతన ఒరవడులు సృష్టించి ఈ కావ్యం రచించినట్లు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమానికి ఆలోచన చేసిన వారు గాయత్రీదేవి అన్నారు. భీష్మ ఏకాదశి పర్వదినాన కలియుగ వేంకట నాథుడిపై తామంతా రాసిన పద్య కావ్యాన్ని ఆయన సన్నిధిలో ఆవిష్కరించడం తమ పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. ఈ కావ్యాన్ని ముద్రించేందుకు అయ్యే వ్యయాన్ని పద్య శిఖామణి డాక్టర్ గాయత్రీదేవి భరించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ పద్య కావ్యాన్ని రచించిన వారందరినీ సభకు పరిచయం చేశారు. రచయితలలో ఒకరైన డాక్టర్ గాయత్రీదేవిని, రచయిత లను కూడా సత్కరించారు. డాక్టర్ గాయత్రీదేవి మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామిపై షడ్భుజ వేంకటేశ్వర పద్య కావ్యాన్ని రచించేందుకు తాను చేపట్టిన కార్యక్రమానికి బ్రహ్మశ్రీ తోపెల్ల వారు అందించిన సహకారం మరువ లేనిదన్నారు. ఆయనకు, తోటి రచయితలకు మనఃపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపమాక గ్రామస్తుల తరఫున బ్రాహ్మణ సంఘం వేదమూర్తులు తోపెల్ల, శంకరయ్య, గాయత్రీదేవిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమస్యాపృచ్ఛక చక్రవర్తి, పద్య శంకర కంది శంకరయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీపాద సత్యదేవ శర్మ, యాజ్ఞవల్క్యశర్మ, మెరుగుమల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ యలమంద, ఆకుండి శైలజ, ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, ప్రముఖ తెలుగు పండితులు ఎస్‌వీఎస్ ఆచార్యులు, నక్కపల్లి తాలూకా బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు డీవీ రామారావు, శ్రీపాద ప్రణవ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపమాకలో రక్తికట్టిన అష్టావధానం



అష్టావధానం నిర్వహిస్తున్న దృశ్యం



శతావధాని భరత్‌శర్మ

నక్కపల్లి : ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ప్రముఖ యువ శతావధాని ఉప్పలదడియం భరత్ శర్మ నిర్వహించిన అష్టావధానం అలరించింది. తరిగొండ వెంగమాంబ సాహితీపీఠం వ్యవస్థాపకురాలు, డాక్టర్ గాయత్రీదేవి అనంతఛ్ఛందం, నావీస్ మహతిచానల్, పద్యగురుసార్వభౌమ బ్రహ్మశ్రీ తోపెల్ల బాలసుబ్రహ్మణ్యశర్మ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. ఈ అవధానంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ కవులు, వేదపండితులు పృచ్ఛకులుగా హాజరై తమ ప్రతిభతో అవధాన కార్యక్రమాన్ని మరింత రక్తికట్టించారు. న్యస్తాక్షరి, దత్తపది, అప్రస్తుత ప్రసంగం, కావ్యవర్ణన, నిషిద్ధాక్షరి, ఛందోభాషణం తదితర అంశాలు చూపరులతో జేజేలుకొట్టించాయి.

పిన్న వయసులోనే బహుముఖ ప్రజ్ఞ

అష్టావధానం కార్యక్రమం తిరుపతికి చెందిన భరత్ శర్మ నిర్వహించారు. ఈయన ప్రస్తుతం తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నారు. తన 15వ ఏటనే మొట్టమొదట అష్టావధానాన్ని నిర్వహించారు. 17వ ఏటనే శతావధానాన్ని నిర్వహించారు. ఇప్పటి వరకు 79 అష్టావధానాలు, 3 శతావధానాలు నిర్వహించారు. అవధానం, ప్రవచనం, మృదంగంలో దిట్ట. ఇప్పటివరకు శర్మ శివభవేశ శతకము, యాదగిరి లక్ష్మీనృశింహేశ్వర శతకము, అనంతచ్ఛంద సౌరభము, భరత శతావధానం, శ్రీ కపిలేశ్వరశతకాలను రచించారు. శతావధాన తిలక, అవధాన బాల భాస్కర, అవధాన కళారంజక, అవధాన బాలసరస్వతి, అవధాన సవ్యసాచి, అవధాన కేసరి, అవధాన విద్వన్మణి, అవధాన కళామార్తాండ వంటి బిరుదులు పొందారు. పిన్నవయసులోనే శతావధానిగా గుర్తింపు పొందిన భరత్‌శర్మను ఉపమాక ఆలయంలో గ్రామస్తులు, తరిగొండ వెంగమాంబ సాహితీ పీఠం, తాలూకా బ్రాహ్మణ సంఘం తరఫున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భరత్‌శర్మ మాట్లాడుతూ త్రిభాషా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్, ఛందశ్శాస్త్ర రత్నాకర బ్రహ్మశ్రీ తోపెల్ల బాలసుబ్రహ్మణ్యం శర్మల వద్ద శిష్యరికం చేసి ఈ స్థాయికి వచ్చానన్నారు. సంస్కృతాంధ్రాల్లో కావ్యాలు, పురాణాల ద్వారా నేటి యువతకు సమాజానికి అందే సందేశం తెలియజేయడం, అవధాన ప్రక్రియ ద్వారా విద్యార్థుల్లో ధారణశక్తి, చింతన విధానం, ఆలోచన శక్తి ఏవిధంగా పెంపొందించవచ్చో తెలియజేసి సమాజాన్ని చైతన్య పరచి తద్వారా ఉన్నత జీవనాన్ని పొందడాన్ని తెలియజేయడమే లక్ష్యమని అన్నారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు



ఆలయ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం

కె.కోటపాడు : కె.కోటపాడు గ్రామంలో నూతనంగా నిర్మాణం జరిపిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని శనివారం అత్యంత వైభవంగా ప్రారంభోత్సవ, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని జరిపారు. అర్చకులు గొరుగుంతు రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో శిఖరప్రతిష్ఠ, గోదర్శ, బింబదర్శన కార్యక్రమాల అనంతరం అమ్మవారి దర్శన భాగ్యాన్ని ప్రజలకు కల్పించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మాజీ డిప్యూటీ సీఎం, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, దేవరాపల్లి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూరె బాబూరావు తదితరులు దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ నిర్మాణానికి తోడ్పాటును అందించిన బూడి ముత్యాలనాయుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌ను వాసవీక్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని జరిపారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. అమ్మవారిని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, లెక్కల శంకరరావు, శ్రీకాంత్ శ్రీను దర్శించుకున్నారు.

ఘనంగా ముగిసిన స్పందన యువజనోత్సవాలు



మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు



అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

పాయకరావుపేట: శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్న స్పందన యువజనోత్సవాలు–2025 ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు, గౌరవ అతిథిగా శ్రీ ప్రకాష్ పూర్వ విద్యార్థి, ఫోరెన్సిక్ సైంటిస్ట్ పీవీఎస్‌బీ చలపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి సంధాన కర్తగా నిర్వహించిన చరవాణి – తక్షణ ప్రజాదరణకు దారి తీస్తుందా లేదా.. మానవ దివాలాకు దారి తీస్తుందా అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠిలో విద్యార్థులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు మాట్లాడుతూ ఇటువంటి యువజనోత్సవాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తాయన్నారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల ప్రయత్నాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. టెక్నాలజీపరంగా అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. తన తనయుడు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లోనే చదివాడన్నారు. బాస్కెట్ బాల్ ప్లేయర్‌గా ఇంటర్ యూనివర్సిటీ పోటీలో ఆంధ్ర విశ్వ విద్యాలయం తరఫున ఆడారని, ఇప్పుడు అమెరికాలోని చికాగోలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రుల కోరిక ప్రకారం నడుచుకోవాలని, తెలివితేటలు, కష్టపడే తత్వం ప్రతి ఒక్కరినీ ఉన్నత శిఖరాలకు చేరుస్తాయని తెలిపారు. శ్రీ ప్రకాష్ పూర్వ విద్యార్థి పీవీఎస్‌బీ చలపతి మాట్లాడుతూ మనం ఎంచుకునే రంగాల నుండే అనేక ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. విద్యా సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచే విధంగా తీర్చిదిద్దేందుకు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనకు ప్రణాళికలు రూపొందించుకుని, వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. తల్లిదండ్రుల కలలను నిజం చేయడమే వారికి మనం ఇచ్చే కానుక అని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ సీహెచ్‌వీకే నరసింహారావు, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట–విజయవాడ సెక్షన్ పరిధిలో జరుగుతున్న నాన్–ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు : విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్(18519)ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు, లోకమాన్య తిలక్ టెర్మినస్–విశాఖపట్నం(18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12వ తేదీ నుంచి 22వ తేదీ వరకు, టాటానగర్–యశ్వంత్‌పూర్(18111) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13వ తేదీన, యశ్వంత్‌పూర్–టాటానగర్(18112) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9, 16వ తేదీల్లో రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు : షాలిమర్–హైదరాబాద్– షాలిమర్ (18045/46) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు మళ్లించబడిన మార్గంలో వయా సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా నడుస్తాయి.

- ఛత్రపతి శివాజి టెర్మినస్ ముంబయి–భువనేశ్వర్–ఛత్రపతి శివాజి టెర్మినస్ ముంబయి (11019/11020)కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మళ్లించబడిన మార్గంలో వయా వాడి, వికారాబాద్, సికింద్రాబాద్, గుంటూరు, విజయవాడ మీదుగా నడుస్తాయి.
- షాలిమర్–సికింద్రాబాద్ (22849) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19వ తేదీన మళ్లించబడిన మార్గంలో వయా విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, సికింద్రాబాద్ మీదుగా నడుస్తుంది.

వందేభారత్ రీ షెడ్యూల్ : ఈ నెల 19, 20వ తేదీల్లో ఉదయం 5.45 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–సికింద్రాబాద్(20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా ఉదయం 7.15 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 19, 20వ తేదీల్లో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్–విశాఖపట్నం(20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4.15గంటలకు బయల్దేరుతుంది.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు : విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్ ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు దంతేవాడ నుండి బయల్దేరుతుంది.

- విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. ఈ తేదీల్లో ఈ రైళ్లు దంతేవాడ–కిరండూల్ మధ్య రాకపోకలు సాగించవు.

పైడికొండలో ఆటో బోల్తా

- డ్రైవర్ సహా 16 మంది మహిళలకు తీవ్రగాయాలు
- క్షతగాత్రులంతా రొయ్యల కంపెనీ కార్మికులే



ఘటనాస్థలంలో నుజ్జైన ఆటో, గాయాలపాలైన మహిళలు

తొండంగి: ముగ్గురు మాత్రమే ప్రయాణించాల్సిన ఆటోలో డ్రైవర్‌తో కలిపి 19 మంది ప్రయాణించడంతో ఆటో అదుపు తప్పి పల్టీలు కొట్టడంతో 17 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం పైడికొండలో శనివారం జరిగిన ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణాపురంలో అవంతి రొయ్యల కంపెనీలో పని చేసేందుకు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెద రామభద్రాపురం నుంచి ఆటో వెళ్తుంది. శనివారం ఉదయం రామభద్రాపురం, శ్రీరాంపురం గ్రామాలకు చెందిన కూలీలను ఎక్కించుకుని ఆనూరు, పైడికొండ మీదుగా వెళ్తుండగా అక్కడి మలుపు వద్ద చెట్లు కొట్టేసి రహదారిపై వదిలేసిన ప్రదేశం వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ పట్నాల సంతోష్‌తో పాటు 16 మంది మహిళా కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆ ప్రాంతం రోదనలతో మిన్నంటింది. వెంటనే స్థానికులు వారందరినీ తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ జగన్‌మోహన్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గాయపడ్డ వారి వివరాలిలా...

ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెదరామభద్రాపురానికి చెందిన నక్కిన లక్ష్మి, ఎస్.లక్ష్మి, కనకం దేవి, మంతిన రమణమ్మ, పులి లోవకుమారి, గెడ్డమూరి సీతారత్నం, కోటిన లక్ష్మి, పగడం చిన్నమ్ములు, జీలం పద్మ, తుంపాల అనంతలక్ష్మి, ఉగ్గిన దేవి, ఉగ్గిన సత్యవతి, నంగిన పద్మ, శ్రీలం ధనలక్ష్మి, కర్రి లక్ష్మి, నారిపిరెడ్డి నాగమణి, పట్నాల సంతోష్ (ఆటో డ్రైవర్)లకు తలకు, కుడిభుజం, కాళ్లు, చేతులు, నడుము విరగడం వంటి తీవ్రగాయాలయ్యాయి. వీరికి తుని ఏరియా ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం కొంత మందిని కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అధిక లోడుతో పాటు మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెప్పున్నారు.

క్లుప్తంగా

వేడుకగా భీష్మ ఏకాదశి


కశింకోటలో లక్ష్మీనృసింహస్వామికి భీష్మ ఏకాదశి పూజలు

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పురస్కరించుకొని శనివారం అందంగా పూలమాలలు, తులసీ మాలతో నిలువెల్లా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. రాత్రి నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివార్లను అలంకరించి భీష్మ ఏకాదశి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భక్తులు ఎక్కువగా దర్శించారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్టాపన


ఆలయాన్ని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నేతలు

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో నూతనంగా నిర్మించిన కుబేర, శివలింగ సహిత గణపతి, కుమరస్వామి ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ మలసాల రమణారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత ఇక్కడ ఆలయాన్ని దర్శించుకుని గణపతికి పూజలు చేశారు. వీరిని ఆలయ కమిటీ అధ్యక్షుడు దాడి భోగలింగేశ్వరావు, కార్యదర్శి దాడి సూరిబాబు సత్కరించారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 10న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కశింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆ రోజు కన్నూరుపాలెంతోపాటు పాత కన్నూరుపాలెం, తీడ, చెరకాం, లాలంకొత్తూరు, సుందరయ్యపేట, అడ్డాం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఈ విషయాన్ని గుర్తించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 8,036 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3890	4700
మొదటి రకం	3410	4180
రెండో రకం	2950	3680
మూడో రకం	2790	3100

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	రాజా
పుష్ప-2	సత్యనారాయణ స్క్రీన్-1
ఒక పథకం ప్రకారం	సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్	పర్లిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	షిర్డీసాయి
పట్టుదల	వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	శ్రీసత్య (ఉదయం, మొదటి షో)
మదగజరాజ	శ్రీసత్య(మేట్నీ, రెండో షో)
భవాని వార్డు	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 92 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్ - 10 యూనిట్లు, బీ పాజిటివ్- 30 యూనిట్లు, ఓ పాజిటివ్-48 యూనిట్లు, ఏబీ పాజిటివ్ - 3 యూనిట్లు, శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(9703619706) నెంబర్‌ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 325 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 290 మందికి గ్యాస్ సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08921-223595 నంబర్ సంప్రదించవచ్చు.

మేక, గొర్రె వీటి మాంసం రుచే వేరు. తింటే బలంగా తయారవుతారని, అత్యధిక ప్రొటీన్ ఉంటుందని అందరూ చెబుతున్నమాట. అందుకని డబ్బున్న వారి దగ్గర నుంచి పేద, మధ్య తరగతివారు సైతం ఆదివారం, పండగలు, ఎప్పుడు పడితే అప్పుడు లొట్టలేసుకొని తింటుంటారు. మరి మీరు తింటున్నది సురక్షితమైన మాంసమేనా? మటన్ కొనే ముందు ఎలాంటి మోసం జరుగుతుందో తెలుసుకోండి.

మీరు తినే మాంసం నాణ్యమేనా?

- పట్టణంలో మూత పడిన జంతు వధశాల
- నిబంధనలు పాటించని వ్యాపారులు
- రోగాల బారిన పడిన జీవాల మాంసం విక్రయాలు


ప్రభుత్వ రౌండ్ సీల్ లేని మాంసం విక్రయాలు



మూత పడిన మేకల కబేళా భవనం

అనకాపల్లి టౌన్: పట్టణంలో మాంసం విక్రయాలపై జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణ లోపిస్తోంది. దీంతో వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యమైన మటన్ ఎక్కడా కానరావడం లేదు. అనకాపల్లి జీవీఎంసీ పరిధిలో ఐదు వార్డుల పరిధిలో దాదాపు 25 నుంచి 30 మటన్ దుకాణాలు ఉన్నాయి. మటన్ వ్యాపారులు చుట్టు పక్కల వారపు సంతల్లో మేకలు, గొర్రెలను కొనుగోలు చేసి ఇక్కడ వధిస్తారు. కిలో రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు విక్రయిస్తున్నారు.

నిబంధనలివీ...

మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉన్నాయా, వాటికేమైనా జబ్బులు ఉన్నాయా అన్నది ఎవరికీ తెలియదు. మాంసం తిన్న తర్వాత అనారోగ్యం పాలైన సందర్భాలు లేకపోలేదు. ఈ మేకలను పరీక్షించాల్సిన శానిటరీ సూపర్‌వైజర్, పశువైద్యాధికారి ఈ విషయాలను అస్సలు పట్టించుకోరు. వీటి పరీక్షలకు సుంకరమెట్ట రహదారిలో అన్ని వసతులతో కూడిన భవనం నిర్మించారు. కానీ ప్రస్తుతం ఆ భవనం మూతపడి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. నిబంధనల ప్రకారం మేకలు, గొర్రెలు వధించాలంటే ప్రభుత్వానికి రుసుం చెల్లించాలి. పరీక్షల తర్వాత ఆరోగ్యంగా ఉన్నాయి. జబ్బులేమీ లేవు అని నిర్ధారించుకొని వధించడానికి అనుమతి ఇస్తారు. తర్వాత మేకల కాళ్లపై అందరికీ కనబడేలా ప్రభుత్వ రౌండ్ సీల్ వేస్తారు. అప్పుడే మార్కెట్లలో అమ్మకాలు చేపట్టాలి. అలాగే ఏ రోజు మాసం ఆ రోజే అమ్మాలి. ఫ్రిజ్‌లో పెట్టిన మాంసాన్ని అమ్మకూడదు. మాంసంపై ఈగలు వాలకుండా తెరలను వాడాలి. కానీ ఇవేమీ అమలు కావడం లేదు.

అధిక బరువు కోసం వాటర్ ఇంజక్షన్లు..

వధించడానికి ముందు రాత్రి గొర్రె, మేకపోతులను తెచ్చుకుని వాటికి వాటర్ ఇంజక్షన్లు ఇస్తున్నారు. 20 కేజీలు ఉన్న మేకపోతు వాటర్ ఇంజక్షన్లు ఇవ్వడం వల్ల నాలుగు నుంచి ఐదు కిలోలకుపైగా అధిక బరువు ఉంటుంది. ఈ విధంగా చేయడం వల్ల తూకంలో వ్యత్యాసం ఉంటుంది. వినియోగదారులు ఈ మోసాన్ని కనిపెట్టలేకపోతున్నారు. అధికారులు వాటర్ ఇంజక్షన్లు ఇచ్చి అమ్మేవారిపై చర్యలు తీసుకోవడం లేదు. కొనుగోలుదారులు కలుషిత మాంసం తినడం వల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశముందని, ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వసతులు లేక కబేళా మూసివేశాం

కబేళా భవనంలో వాటరు, కరెంట్ సౌకర్యాలు లేకపోవడంతో మూసివేశాం. పట్టణంలో మాంసం విక్రయ కేంద్రాలపై నిత్యం పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడైనా మాంసాన్ని కలుషితం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– రవి, శానిటరీ సూపర్‌వైజర్, జీవీఎంసీ అనకాపల్లి జోన్

కల్తీ మాంసం తింటే రోగాలు



ఆరోగ్యవంతమైన జీవాలను మాత్రమే ఎంచుకోవాలి. దుకాణాల వద్ద అటువంటి వాటి మాంసం కొనుగోలు చేయాలి. కల్తీ మాసం తింటే జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వస్తాయి.

– వాణీ జగదీశ్వరి, వైద్యురాలు ప్రాదమిక ఆరోగ్య కేంద్రం తుమ్మపాల

మాంసం స్వచ్ఛత తెలియడం లేదు



పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వారంలో ఒకసారి మటన్ కొంటున్నాం. ఆ మాంసం స్వచ్ఛంగా ఉందో లేదో తెలియడం లేదు. కల్తీ మాంసం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కల్తీ మాంసంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముంది. అధికారులు దృష్టి సారించి ప్రజారోగ్యాన్ని కాపాడాలి.

– మద్దాల రమణ, అనకాపల్లి

వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పరిశీలించిన ధర్మశ్రీ


వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ధర్మశ్రీ, పక్కన పార్టీ ముఖ్య నేతలు

తుమ్మపాల: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ నిర్మాణాన్ని ఆ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ పరిశీలించారు. కొత్తూరు నర్సింగరావుపేటలో నిర్మిస్తున్న దీన్ని శనివారం ఆయన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి పరిశీలించారు. కాంట్రాక్టర్ కాలయాపనతో కార్యాలయ భవన నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, ముఖ్య నాయకుడు మలసాల రమణారావు, యువజన నాయకుడు మలసాల కుమార్ రాజా, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జీవీఎంసీ 84వ డివిజన్ ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, పట్టణ ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావు, నాయకులు ఆర్మీ సురేష్, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

గవరపాలెంలో తోడపెద్దు సేవ


తోడ పెద్దు ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రత్నాకర్

అనకాపల్లి: గవరపాలెం పెదరామ తోడపెద్దు సేవా సంఘం, ఆడారి నూకయ్య సేవా గరిడి సంఘం ఆధ్వర్యంలో నూతన తోడపెద్దు పాలకొలుపు, అచ్చుపోత కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఆడారి జగన్నాధరావు, ఆడారి నాగభూషణం ఇంటి వద్ద జరిగిన ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, పద్మావతి దంపతుల సారధ్యంలో డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన తోడపెద్దులను పట్టణ పుర వీధుల్లో ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో సేవా గరిడి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన


సర్వమంగళాంబకు లక్ష కుంకుమార్చన చేస్తున్న అర్చకులు

కశింకోట: స్థానిక సర్వ మంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం(శివాలయం)లో శనివారం లక్ష బిల్వార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భీష్మ ఏకాదశి పురస్కరించుకొని లక్ష బిల్వ పత్రాలతో త్రిపురాంతక స్వామిని అర్చకులు వేద మంత్రాల నడుమ అర్చించారు. వాటిపై ఓంకారం రాసి నివేదించారు. స్వామిని కలువ పూలు, నూతన వస్త్రాలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంచామృతాలు, పూజా సామగ్రితో వేద మంత్రాలతో జరిపారు. సర్వమంగళాంబ అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రాత్రి శివలింగ దీపార్చన నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

అనకాపల్లి: పట్టణంలోని పలు దేవాలయాలలో భీష్మ ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవునిగుమ్మం వేంకటేశ్వరస్వామి, గవరపాలెం నూకాలమ్మ, సంకరమెట్ట సూర్యనారాయణ స్వామి, వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి తదితర ఆలయాలలో ఉదయాన్నే పండితులు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద వితరణ జరిగింది.

ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యునిగా రాజు




అనకాపల్లి: ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యునిగా అనకాపల్లికి చెందిన వియ్యపు రాజు ఎన్నికయ్యారు. శ్రీకాకుళంలో శనివారం జరిగిన మహా సభలో ఈ ఎన్నిక జరిగిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అందరికీ విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలు చేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ


మాట్లాడుతున్న డీఈవో గిడ్డి అప్పారావు

సబ్బవరం: సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. పునాది అభ్యాసన –సంఖ్యా శాస్త్రం అనే అంశంపై 1,2 తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు డిసెంబర్ 16 నుంచి నేటి వరకూ నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి అంశాన్ని తరగతి గదుల్లో విద్యార్థులకు బోధించాలన్నారు. ప్రాథమిక విద్యా బోధన పటిష్టంగా ఉన్నప్పుడే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి సుమారు 1,212 మంది ఉపాధ్యాయులు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకునేందుకు విశ్వవిద్యాలయంలో అవకాశం కల్పించినందుకు వీసీ డాక్టర్ సూర్యప్రకాశరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవో (అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్) మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు


ఎన్టీపీసీ మెయిన్ గేటు వద్ద భారీ వాహనాలతో నిలిచిన ట్రాఫిక్

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీకి యంత్ర సామగ్రితో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ ప్లాంట్‌కు సుదూర ప్రాంతాల నుంచి యంత్ర పరికరాలతో నిత్యం భారీ వాహనాలు వస్తుంటాయి. ప్లాంటు లోపలికి వెళ్లాలంటే ముందుగా సెక్యూరిటీ అనుమతి తీసుకోవలసి ఉంది. అనుమతి తీసుకొన్న వాహనాలను మాత్రమే లోపలికి అనుమతిస్తారు. ఒక్కొక్క పర్యాయం అనుమతి పొందిన భారీ వాహనాలకు సకాలంలో సెక్యూరిటీ సిబ్బంది లోపలికి పంపడంలో ఆలస్యమవుతున్న కారణంగా రోడ్డుపైన నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఎన్టీపీసీలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు వాడచీపురుపల్లి, తంతడి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, పరవాడ, గాజువాక తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. తరచూ ఎన్టీపీసీ కూడలిలో రోడ్డుపై నిలుపుతున్న భారీ వాహనాలతో ఏర్పడుతున్న ట్రాఫిక్ వలయంలో చిక్కుకుపోయి గంటల తరబడి అవస్థలు ఎదుర్కొంటున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

అంగరంగ వైభవంగా గౌరీపరమేశ్వరుల మహోత్సవం


మహిళల కోలాటాలు


ఆలయంలో గౌరమ్మను దర్శించుకుంటున్న భక్తులు


సంబరంలో చిరు వ్యాపారాలు


ఫోంపై జారుతున్న చిన్నారులు

కశింకోట: స్థానిక శివాలయం సమీపంలో డీపీఎస్ జెడ్పీ హైస్కూలు వద్ద వెలసిన గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అందంగా పూలతో అలంకరించిన రథంపై గౌరమ్మ విగ్రహాన్ని నిలిపి ఉత్సవ ఊరేగింపు ప్రారంభించారు. అక్కడి నుంచి గ్రామ ప్రధాన వీధుల మీదుగా ఉత్సవ ఊరేగింపు సాగింది. దారి పొడవున ప్రజలు గౌరమ్మను దర్శించుకొని పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీశెట్టి రాంకీ, టీడీపీ జిల్లా కార్యదర్శి దాడి రత్నాకర్, డీఎస్పీ శ్రావణి, సీఐ అల్లు స్వామినాయుడు తదితరులు గౌరమ్మను దర్శించుకున్నారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటాలు, పొడవు మనుషుల నృత్యాలు, నేల వేషాలు, డీజే సౌండ్స్ ఊరేగింపులో ఆకర్షణగా నిలిచాయి. భారీగా బాణసంచా కాల్చారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ, దేవతామూర్తుల విద్యుద్దీపాలంకరణ కటౌట్లు ఆహూతులను ఆకట్టుకున్నాయి. స్థానిక ప్రధాన రహదారి పొడవునా మహిళల అలంకరణ వస్తువులు, వంట గదిలో వినియోగించే వస్తువులు, ఆట వస్తువులు, ఇంటి అలంకరణ వస్తువులు వగైరా అమ్మకాలు జోరుగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రజలు హాజరై ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లల ఫోం జారుడు బల్లలపై ఉల్లాసంగా జారుతూ గడిపారు. ఉదయం నుంచి ఆలయంలో గౌరమ్మను భక్తులు బారులు తీరి దర్శించి వివిధ రూపాల్లో కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు వేగి గోపీకృష్ణ, వేగి దొరబాబు, వేగి రామకోటేశ్వరరావు, పెంటకోట రాము, వేగి వెంకటరావు, కోయిలాడ నాగు, పెంటకోట తాతారావు, వేగి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


ఏఈవో రాంబాబుకు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం మురళీనగర్‌కు చెందిన జి.వెంకటేశ్వరరావు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. సంబంధిత చెక్కును సింహగిరిపై ఉన్న పీఆర్‌వో కార్యాలయంలో ప్రోటోకాల్ ఏఈవో రాంబాబు, సూపరింటిండెంట్ విక్రమ్‌లకు అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి హామీ


పయినీర్ యాజమాన్య ప్రతినిధులకు డిమాండ్ల పత్రం అందజేస్తున్న నాయకులు

మాకవరపాలెం: మండలంలో ఉన్న అన్‌రాక్ (పయినీర్) అల్యూమినియం రిఫైనరీకి అధిక లోడుతో బాక్సైట్ ముడి ఖనిజాన్ని తరలిస్తున్న లారీల కారణంగా రోడ్లు పాడవడం, ప్రమాదాలు జరుగుతున్నాయంటూ శెట్టిపాలెం, భీమబోయినపాలెం, జెడ్.గంగవరం సర్పంచ్‌లు అల్లు రామునాయుడు, రుత్తల నందకిషోర్, దుంగల వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ నెల 5న స్థానికులు 120 లారీలను అడ్డుకున్న సంగతి తెలిసిందే. గత నాలుగు రోజులుగా ఈ నిరసన కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు పయినీర్ ట్రాన్స్‌పోర్ట్, లారీ అసోసియేషన్ ప్రతినిధులు ఇప్పటికే సర్పంచ్‌లతో చర్చలు జరపడంతో పలు డిమాండ్లను వారి ముందుంచారు. మొదటి డిమాండ్ అయిన రోడ్డు విస్తరణకు సంబంధించి వెంకన్నపాలెం నుంచి కంపెనీ వరకు రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులను యాజమాన్యం ప్రారంభించింది. ఈ మేరకు శనివారం పయినీర్ యాజమాన్యం, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులు సంయుక్తంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నిబంధనల మేరకు లారీలను నడుపుతామని, మిగిలిన డిమాండ్లను కూడా పరిష్కరిస్తామని నిరసనకారులకు హామీ ఇవ్వడంతో లారీలను విడిచిపెట్టారు. 15 రోజుల్లోగా తమ డిమాండ్లను పరిష్కరించకుంటే మరలా లారీలను అడ్డుకుంటామని నిరసనకారులు స్పష్టం చేశారు. డిమాండ్లతో కూడిన పత్రాన్ని యాజమాన్య ప్రతినిధులకు అందజేశారు.

కోడి పందాలు ఆడుతున్న వారిపై దాడులు

గొలుగొండ: శనివారం ఏటిగైరంపేట పంచాయతీ శివారు ముంగర్లపాలెం వద్ద కోడి పందాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు చేసి నలుగురు వ్యక్తులు, రెండు కోడిపుంజులను పట్టుకున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. గ్రామాల్లో పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మంగళాపురంలో..

బుచ్చెయ్యపేట: మంగళాపురంలో శనివారం తీర్థ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కోడి పందాలు, గుళ్లాటలపై వచ్చిన సమాచారంతో బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో దాడి చేశారు. రెండు కోడి పుంజులు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 1,600 నగదు, గుళ్లాట ఆడిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుండి రూ.1,400 నగదు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థినులు క్రమశిక్షణతో మెలగాలి

మాడుగుల రూరల్: విద్యార్థినులు క్రమశిక్షణతో మెలగాలని స్థానిక పోలీసు స్టేషన్ మహిళా పోలీసులు దీపిక, రామలక్ష్మి పేర్కొన్నారు. శనివారం రాత్రి మాడుగులలోని హైస్కూల్, కళాశాల వసతి గృహాల విద్యార్థినులకు ఎస్ఐ జి. నారాయణరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.